క్లుప్తంగా

నేడు గ్రామసభలు

వరికుంటపాడు: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకుమండలంలోని 24 పంచాయతీల్లో గురువారం గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వేణు గోపాల్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలను నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామసభ ఆమోదించిన తీర్మానాలను ఈ నెల 13వ తేదీలోగా మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

జేవీవీ క్యాలెండర్ల ఆవిష్కరణ



ఆత్మకూరు: జనవిజ్ఞాన వేదిక నూతన సంవత్సర క్యాలెండర్లను వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మాజీ ఎంపీటీసీ మంజూష దంపతుల చేతుల మీదుగా బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ కార్యవర్గ సభ్యులు హరికృష్ణ, మురళి, వాగాల శ్రీహరి, సాదిక్ హుస్సేన్, నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వస్త్రాల పంపిణీ



కావలి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కావలి డిపోలో పనిచేస్తున్న 40 మంది పారిశుధ్య కార్మికులకు కండక్టర్లు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. డిపో గ్యారేజ్‌లో డిపో మేనేజర్ రావూరు శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్లు కల్పన, ఎస్కే ఖాజామొహిద్దీన్, క్లర్క్ బ్రహ్మరెడ్డి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటీవ్ రవిప్రకాష్ చేతుల మీదుగా దుప్పట్లు, బిరియాని ప్యాకెట్లు అందజేశారు. కండక్టర్స్ గ్రూప్ అడ్మిన్లు హరిప్రసాద్, ఎస్డీ వై గని, షేక్ కాలేషా, పీపీ సుబ్బారావు, పులిశెట్టి శ్రీనివాసులు, సుధాకర్ పాల్గొన్నారు

పేదలకు దుప్పట్ల వితరణ



వింజమూరు(ఉదయగిరి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వింజమూరు పంచాయతీ పరిధిలోని జైభీంనగర్‌లోని 70 మంది పేదలకు విశ్రాంత డీఎంహెచ్ఓ కే మాళిలామణి బుధవారం దుప్పట్లు వితరణ చేశారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు దుప్పట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, ప్రీతిక, స్థానికులు జీ చెన్నయ్య, ఎన్ బాలయ్య, నరసింహులు, మాచర్ల, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చాకలకొండలో సినార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరాన్ని బుధవారం నిర్వహించారు. గేదెలకు, జీవాలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. పశువైద్యాధికారి కోటేశ్వరరావు, వెటర్నరీ అసిస్టెంట్ రామాంజనేయులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, రమేష్, సర్పంచ్ సుబ్బులక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



చేజర్ల: మండలంలోని దొరువుపాడు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు స్వల్పగాయాలయ్యాయి. సంగం నుంచి పెంచలకోనకు వెళుతున్న మినీట్రక్కు వ్యాన్, ఆదూరుపల్లి నుంచి వావిలేరుకు పోతున్న ట్రాక్టర్ దొరువుపాడు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మినీ ట్రకు వ్యానులోని మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రురాలిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు.

దాహార్తి తీరేదెన్నడో?

- నత్తనడకన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనులు
- 2007లో అప్పటి సీఎం వైఎస్సార్ హయాంలో మంజూరు
- ఇప్పటి వరకు రూ.20 కోట్ల వ్యయం
- పుష్కరకాలం గడుస్తున్నా అసంపూర్తిగానే పనులు



కంపచెట్లతో నిండిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు

జలదంకి: మండల ప్రజల దాహార్తిని తీర్చే లక్ష్యంతో దివంగత సీఎం వైఎస్సార్ మంజూరు చేసిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటి వరకు కోట్లాది రూపాయలు ఖర్చుచేసినా మంచినీటి పథకం అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వాలు, ప్రజాప్రతి నిధుల నిర్లక్ష్యంతో మండల ప్రజల దాహార్తి తీరడం లేదు.

2007లో వైఎస్సార్ హయాంలో మంజూరు

మండల ప్రజల దాహార్తిని తీర్చేందుకు 2007లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మంజూరు చేశారు. అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. చినక్రాక రెవెన్యూ పరిధిలోని 14వ మైలు వద్ద 80 ఎకరాల్లో రూ. 6.4 కోట్ల అంచనా వ్యయంతో పనులను ప్రారంభించారు. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ట్యాంకు చుట్టూ మట్టికట్టను నిర్మించి నిధులు అయిపోయాయని పనులు నిలిపివేశారు. అనంతరం అప్పటి జిల్లా మంత్రి చొరవతో మరో రూ.4 కోట్లను ప్రభుత్వం విడుదల చేయగా మట్టికట్టకు రివిట్‌మెంట్ మాత్రమే చేసి నిధులు సరిపోలేదని మళ్లీ పనులను పూర్తిగా నిలిపివేశారు. వైఎస్సార్ మరణానంతరం ప్రభుత్వాలు పనులను గాలికి వదిలేశాయి. అంచనా వ్యయంతోనే ట్యాంకు నిర్మాణం పూర్తి కావాల్సి ఉండగా రూ.10 కోట్లకు పైగా నిధులు వెచ్చించినా చివరకు రివిట్‌మెంట్‌తో కూడిన కట్ట మాత్రమే మిగిలింది. అనంతరం 2018లో ట్యాంకు నిర్మాణానికి నాబార్డు ద్వారా మరో రూ.10 కోట్లు మంజూరు చేసినా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

పుష్కరకాలం గడిచినా..

దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మంజూరు చేశారు. కావలి కాలువ ద్వారా సోమశిల జలాలను సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు తరలించి మండల ప్రజలకు తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. పుష్కరకాలం గడుస్తున్నా మంచినీటి పథకం పనులు ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయి. ప్రస్తుతం ట్యాంకులో కంపచెట్లు విపరీతంగా పెరిగి అడవిని తలపిస్తోంది. మట్టికట్టకు చేసిన రివిట్‌మెంట్ సైతం దెబ్బతింది.వాటర్ ట్యాంకు, వాటర్ ఫిల్టర్ నిర్మాణ పనులు మొక్కుబడిగా సాగుతున్నాయి.

ట్యాంకు నిర్మాణం ఇలా..

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు సమీపంలోని సోమశిల కావలి కాలువ నుంచి పైప్‌లైన్ నిర్మించాలి. సోమశిల జలాలను సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు తరలించి శుద్ధి చేయాలి. వాటిని మండలంలోని 11 చోట్ల ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించి వాటి ద్వారా పంచాయితీలకు అందించాల్సి ఉంది. ఈ ఏడాదైనా మంచినీటి పథకం నిర్మాణ పనులు పూర్తిచేసి దాహార్తిని తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రెండు నెలల్లో పూర్తి చేస్తాం

జలదంకి మండలంలోని 17 పంచాయతీల తాగునీటి అవసరాల నిమిత్తం 14వ మైలు వద్ద సమ్మర్ స్టోరేజ్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గతంలో నిధులు చాలక కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. 2018లో నాబార్డు ద్వారా ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు మంజూరయ్యాయి. మరో రెండు నెలల్లో నిర్మాణ పనులు పూర్తవుతాయి.

– మసూద్‌అహ్మద్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, జలదంకి





నిరుపయోగంగా ఫిల్టర్, అండర్‌గ్రౌండ్ ట్యాంకు



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు

టీకాలతో ప్రాణాంతక వ్యాధులు దూరం



వరికుంటపాడు: తల్లిదండ్రులు తమ బిడ్డలకు సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధులను దూరంగా ఉంచవచ్చని సీహెచ్ఓ రాజశేఖర్‌రాజు తెలిపారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, రామాపురం గ్రామాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. వైద్యారోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. టీకాలు అందించాల్సిన వారి జాబితాను ముందుగా తయారు చేసుకోవాలని సూచించారు. కాగా మండలంలోని కాంచన గ్రామంలో మండల వైద్యాధికారిణి కరిష్మా 104 వాహన సేవలను అందజేశారు.

రామలింగేశ్వరునికి విశేష పూజలు

దుత్తలూరు: నూతన సంవత్సరం సందర్భంగా దుత్తలూరులోని ఊరకొండపై కొలువైన రామలింగేశ్వరస్వామి ఆలయంలో పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. అలాగే నందిపాడులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, కొత్తపేట శివాలయం, నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవస్థానాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని కొత్త సంవత్సరంలో సకల శుభాలు కలగాలని వేడుకున్నారు.

రూ.1.76 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం

ఆత్మకూరురూరల్: మండలంలోని 38 గ్రామాల్లో గ్రామీణ ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ నిధులు రూ.1.76 కోట్లతో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు పీఆర్ ఏఈ ఖాదర్‌మస్తాన్ తెలిపారు. ఇప్పటికే 70 శాతం సీసీరోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లుగా వివరించారు.

నేత్రపర్వంగా పోలేరమ్మ గ్రామోత్సవం



గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ గ్రామోత్సవం



యాదవుల వీరతాళ్లు

అల్లూరు: అల్లూరు గ్రామదేవత పోలేరమ్మ గ్రామోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అక్కాచెల్లెళ్లు అయిన గంగమ్మ, కళుగోళమ్మ, పోలేరమ్మలను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనాలపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం వేకువన ప్రారంభమైన గ్రామోత్సవం రాత్రి వరకు సాగింది. గ్రామోత్సవంలో యాదవుల వీరతాళ్లు, కోలాటాలు, డిజే సౌండ్స్, తీన్‌మార్, కీలుగుర్రాలు, సంప్రదాయ తప్పెట్లు, మంగళవాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కాలనీల్లో భక్తులకు అన్నప్రసాదాలను వితరణ చేశారు. కాగా పోలేరమ్మ చెట్టు వద్ద విశేషంగా అలంకరించి కొలువుదీర్చిన పోలేరమ్మ, కలుగోళమ్మ, గంగమ్మ ఉత్సవమూర్తులను భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ గ్రామోత్సవంలో నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పోలేరమ్మను దర్శించుకున్న ఎంపీ వేమిరెడ్డి

అల్లూరు పోలేరమ్మను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం రాత్రి దర్శించుకున్నారు. పోలేరమ్మ ఆలయానికి వచ్చిన ఎంపీతో పాటు ఆయన సోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నూతన సంవత్సరం రోజున అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన కాంక్షించారు.



గ్రామోత్సవం ముందు గంగపెట్టెను తీసుకెళ్తున్న భక్తులు



పోలేరమ్మ చెట్టు వద్ద కొలువుదీరిన అమ్మవార్లు

టాలెంట్ టెస్ట్ కరపత్రాల ఆవిష్కరణ



ఆత్మకూరు: ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ (అపస్మా) ఆధ్వర్యంలో ఈ నెల 24న నిర్వహించనున్నట్లు మనోహర్‌రెడ్డి మెమోరియల్ టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. పట్టణంలోని రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎంఎంటీఎస్ఈ జిల్లా కన్వీనర్ రమణారెడ్డి, అపస్మా రాష్ట్ర జాయింట్ కార్యదర్శి ఈగా భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అపస్మా జిల్లా కార్యదర్శి రామ మనోహర్‌రెడ్డి, ఆత్మకూరు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు మల్లికార్జున నాయుడు, శ్రీమన్నారాయణ, వెంకటేశ్వర్లురెడ్డి, టీసీ వెంకట సుబ్బయ్య, పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణను అలవర్చండి



వరికుంటపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకునేలా ఉపాధ్యాయులు చూడాలని ఎంఈఓ 1 మస్తాన్‌వలి సూచించారు. బుధవారం ఆయన మండలంలోని జి.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పట్టీలు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. విద్యార్థులకు సులభరీతిలో విద్యాబోధన చేయాలన్నారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు.

జొన్నవాడ క్షేత్రానికి బస్సు సౌకర్యం

కావలి: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి సన్నిధికి కావలి నుంచి ప్రతి శుక్రవారం ఆర్టీసీ బస్సు సర్వీసును నడుపనున్నట్లు కావలి డిపో మేనేజర్ రావూరు శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి ఆదేశాలతో బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. కావలిలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బస్సు బయలుదేరుతుందని చెప్పారు. అల్లూరు, రాజుపాళెం, బుచ్చిరెడ్డిపాళెం మీదుగా జొన్నవాడకు చేరుకుంటుందని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శనం చేసుకుని ఆలయ ప్రాంగణంలో నిద్ర చేసిన పిమ్మట ఉదయం 6గంటలకు జొన్నవాడలో బయలుదేరి కావలికి ఉదయం 8 గంటలకు బస్సు చేరుకుంటుందని వివరించారు. కావలి, అల్లూరు ప్రాంత భక్తులు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇటీవల ప్రతి శనివారం ఉదయం 9 గంటలకు కొండబిట్రగుంటకు ప్రారంభించిన బస్సు సర్వీసును ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



కావలి: వైఎస్సార్‌సీపీలో కార్యాలయంలో కేక్ కట్ చేసిన నాయకులు

కావలి: పట్టణ ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం అర్ధరాత్రి యువత సందడిగా బాణసంచా కాల్చి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. అనంతరం కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. బుధవారం ఉదయం ప్రజలు తమ ఇష్టదైవాలను దర్శించుకుని నూతన సంవత్సరంలో సకల శుభాలు కలిగేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. కాగా పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కేక్ కట్ చేశారు.

అంబరాన్ని అంటిన సంబరాలు

ఆత్మకూరు: పట్టణంలో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని అంటాయి. మంగళవారం అర్ధరాత్రి పలు సెంటర్లలో యువత బాణసంచా కాల్చి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. బుధవారం ఉదయం పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కాశీనాయన ఆశ్రమాలను భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. కొత్తసంవత్సరంలో సకల శుభాలు కలిగేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. కాశీనాయన ఆశ్రమంలో భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. కాగా మున్సిపల్ కమిషనర్ సీ గంగా ప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, యువత నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, నందవరం ప్రతాప్, షేక్ జమ్రు, తదితరులు పాల్గొన్నారు. ఎల్‌ఆర్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త షకీల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

సంగం : సంగంలో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్ని అంటాయి. వాడవాడలా యువత కేకులు కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. హైవేపై యువకులు, సిబ్బందితో కలిసి సీఐ వేమారెడ్డి కేక్ కట్ చేశారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సోమ్లానాయక్ కట్ కట్ చేశారు. తహసీల్దార్‌కు నాయకులు, కార్యాలయ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ షాలెట్‌కు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

చేజర్ల: స్థానిక అరుంధతీయవాడలోని చర్చిలో మంగలి వెంకటేశ్వర్లు, నరసమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్ క్రాంతికుమార్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరు మండలాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి యువత కేరింతలు కొడుతూ బాణసంచా కాల్చి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. అనంతరం కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కాగా వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని బెంగుళూరులోని ఆయన నివాసంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఉదయగిరిలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకొన్నారు. పలు శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన ఉన్నతాధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కలిగిరి: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన కలిగిరితో పాటు గ్రామాల్లో యువత మంగళవారం అర్ధరాత్రి బాణసంచా కాలుస్తూ కేక్‌లు కట్‌చేసి నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఉద్యోగులు సహచరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

వరికుంటపాడు: మండల ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి కేకులు కట్ చేసి పంచుకుంటూ ఒకరికొకరు కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బుధవారం ఉదయం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఉదయగిరి: మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు



ఉదయగిరిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వింజమూరులో..



ఆత్మకూరు: కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంగం: తహసీల్దార్ కార్యాలయంలో..



సంగం: సీఐ, ఎస్సైకు సత్కారం



చేజర్ల: చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ